క్లుప్తంగా

28న బీసీ రుణాలకు ఇంటర్వ్యూ

సరుబుజ్జిలి: ఈ నెల 28వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ద్వారా అందజేయనున్న సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎం.పావని మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. ఇంటర్వ్యూకు వచ్చే దరఖాస్తుదారులు ఆన్‌లైన్ దరఖాస్తు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, రేషన్ కార్డు జిరాక్స్‌లు మూడు సెట్లు, రెండు పాస్ ఫొటోలతో హాజరుకావాలన్నారు.

తాగునీటి వనరుల పరిశీలన



తాగునీటి బావిని పరిశీలిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: మండలంలోని గిరిశిఖర గ్రామం హడ్డివాడలో ఉన్న రెండు బావులు అడుగంటిపోయాయి. కొండ నుంచి వస్తున్న జక్కర నీటినే తాగుతున్నారు. ఈ సమస్య అధికారుల దృష్టికి వచ్చింది. మంగళవారం ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్ హడ్డివాడ గ్రామాన్ని సందర్శించారు. తాగునీటి బావులను పరిశీలించారు. తాగునీటి బోరును మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. ప్రతీ ఏడాది ఫిబ్రవరి నుంచే తాగునీటి సమస్య వస్తుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న తెలగ సంక్షేమ సంఘం ప్రతినిధులు

పొందూరు: మండల కేంద్రంలోని పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా పలు సంఘాల ప్రతినిధులు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఎండ తీవ్రతను దృష్ట్యా భాష్యం స్కూల్, తెలగ సంక్షేమ సంఘం, కళింగ కోమటి సంక్షేమ సంఘం, ధ్యాన ఆరోగ్య కేంద్రం, మల్లికార్జున దేవాలయం, అయ్యప్ప స్వామి దేవాలయం ప్రతినిధులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాకర్ల పైడిలింగం కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

చర్యలు తీసుకోవాలి

పొందూరు: మండలంలోని బాపిరాజుపేటకు చెందిన ఓ మహిళ నకిలీ సర్టిఫికెట్‌తో అంగన్‌వాడీ ఆయాగా ఉద్యోగం పొందిందని, ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన సూర కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు మంగళవారం తెలిపారు. గతంలో ఐసీడీఎస్ సీడీపీఓకు ఇదే విషయంపై ఫిర్యాదు చేసి నాలుగేళ్లు అయిందని, ఇంతవరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ప్రస్తుతం సదరు ఆయా ఓపెన్ యూనివర్సిటీలో పదో తరగతి పరీక్షలు రాసేందుకు సెలవు పెట్టారన్నారు. ఈ విషయంపై సీడీపీఓ అనురాధతో మాట్లడగా.. గతంలో ఆయా ఉద్యోగాలకు 7వ తరగతి విద్యా అర్హత సరిపోయేదన్నారు. ప్రస్తుతం విద్యా అర్హతను 10వ తరగతికి మార్చారన్నారు.

ఏకకాలంలో చెల్లిస్తే.. 50 శాతం వడ్డీ రాయితీ

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్ను బకాయిల మొత్తాన్ని ఈ నెలాఖరులోగా ఏకకాలంలో చెల్లిస్తే.. అటువంటి వారికి వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వనున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు ప్రభుత్వం వెలువరించినట్లు తెలిపారు. సకాలంలో పన్నులు చెల్లించి వడ్డీ రాయితీని పొందాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పరిష్కారం కాని సాగునీటి సమస్య



చెరువు వద్ద రైతులతో మాట్లాడుతున్న అధికారులు

మెళియాపుట్టి: మండలంలోని సుందరాడకు చెందిన చాపరాయి చెరువు నీటిని మాకనాపల్లికి చెందిన రైతులు సాగుకు వాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సుందరాడ రైతులు అడ్డుకున్నారు. ఇరు గ్రామాల ప్రజలు సోమవారం పరస్పరం అధికారులకు ఫిర్యాదులు చేసుకున్నారు. దీనిపై అధికారులు మంగళవారం స్పందించారు. తహసీల్దార్ పాపారావు, ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా, ఎస్‌ఐ రమేష్ బాబు చెరువు వద్దకు చేరుకుని ఇరు గ్రామాల ప్రజలు, రైతులకు సర్దిచెప్పినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ విషయం పైఅధికారుల దృష్టిలో ఉండటంతో సమస్యను వారే పరిష్కరించాల్సి ఉంది.

నీరుగారిన లక్ష్యం!

- వృథాగా నీటితొట్టెలు
- వేసవిలో పశువులకు అందని తాగునీరు
- పట్టించుకోని అధికారులు

ఆమదాలవలస నియోజకవర్గంలో ఆర్‌ఎస్‌కేలు, పశువుల వివరాలు ఇలా..

మండలం	నీటితొట్టెలు	ఆవులు	గేదెలు
బూర్జ	12	4,500	2,100
ఆమదాలవలస	19	6,900	3,200
పొందూరు	18	5,430	2,245
సరుబుజ్జిలి	14	4,789	1,908



వి.ఎన్.పురంలో మట్టితో నిండిన నీటితొట్టి



ఆరుబయట మేత మేస్తున్న పశువులు

సరుబుజ్జిలి: పథకాల నిర్వహణ విషయంలో శ్రద్ధ చూపకపోవడంతో ఆదిలోనే లక్ష్య సాధనకు విఘాతం కలుగుతుంది. నిర్వహణ విషయంలో ఆశించిన ప్రగతి లేకపోవడం వలన లక్షలాది రూపాయల నిధులు గంగపాలవుతున్నాయి. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, పొందూరు, బూర్జ, ఆమదాలవలస మండలాలకు సంబంధించి వేసవిలో పశువులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఒక్కో నీటితొట్టిని రూ.35 వేలు ఖర్చు చేసి 63 నీటితొట్టెలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014లో నిర్మించారు. వీటిలో 60 శాతానికి పైగా నిరుపయోగంగా ఉన్నాయి. నియోజకర్గంలో 83 రైతు సేవా కేంద్రా పరిధిలో ఆవులు 21,689, గేదెలు 9,453 ఉన్నాయి.

నీటితొట్టెల లక్ష్యం ఇది..

మేతకు వెళ్లి దాహంతో తిరిగి వచ్చే పశుల దాహార్తిని తీర్చేందుకు గ్రామ పొలిమేరల్లో నీటిత్టొల నిర్మాణం చేపట్టారు. ఈ తొట్టెలను కుండీల మాదిరిగా తయారుచేశారు. ఈ కుండీల్లో తాగునీరు ఏర్పాటు చేయాలి. నిర్మాణాలు చేపట్టారు కానీ.. వీటి నిర్వహణ విషయంలో శ్రద్ధ చూపకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి.

కలుషిత నీరే దిక్కు..

వేసవి కాలంలో పశువులకు తాగునీరు అందించేందుకు పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువులు పూర్తిగా అడుగంటి పోవడం వలన మురికి గుంతల్లో ఉన్న కలుషిత నీటిని పశువులు తాగుతున్నాయి. దీనివలన అంటువ్యాధులకు గురవుతున్నాయి.

తాగునీటి సౌకర్యం కల్పించాలి



లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి నీటితొట్టెలు నిర్మించినా వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోవడం లేదు. బోర్ల ద్వారా వచ్చిన నీటిని తొట్టెల్లో నింపి పశువుల దాహార్తిని తీర్చాలి. అలా ఎక్కడా చేయకపోవడంతో వేసవిలో పశువులకు తాగునీరు దొరకడంలేదు.

– చల్ల యర్రయ్య, పాడిరైతు, చిగురువలస

వ్యాధుల బారిన పడుతున్నాయి



మండుటెండలో మేతకు వెళ్లి వస్తున్న పశువుల దాహం తీర్చుకొనేందుకు మురికి నీటిని తాగుతున్నాయి. నీటి కాలుష్యం వలన తరచూ పారుడు, జబ్బవాపు వ్యాధుల బారినపడుతున్నాయి. చికిత్సలు అందించలేక నరకయాతన అనుభవిస్తున్నాం.

– పి.మోహన్‌రావు, పాడిరైతు, మతలుబుపేట

చర్యలు తీసుకుంటాం



పశువుల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటితొట్టెల నిర్వహణ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నమాట వాస్తవమే. గ్రామల్లో నీటితొట్టెల పరిస్థితులను తెలుసుకొని నిర్వహణ చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటాం.

– సి.హెచ్.సుబ్రహ్మణ్యం, సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, సరుబుజ్జిలి

ప్రజా సమస్యలపై పోరాడుదాం

- వైఎస్సార్‌సీపీ సమావేశంలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ప్రజా సమస్యలపై పోరాటం చేసేది, ప్రజల పక్షాన నిలిచేది వైఎస్సార్‌సీపీయేనని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిలువునా మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన పది నెలల్లోనే ప్రజలను నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. మహిళలకు తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, తదితర సంక్షేమ పథకాలను ఎన్నికల ముందు అందిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చి.. ఇంతవరకు అమలు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతిపక్ష పాత్ర సమర్థవంతంగా పోషించాలన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, కొత్తూరు జెడ్పీటీసీ భాగ్యలక్ష్మి, ఉర్లాన బాలరాజు, బైపోతు ఉదయ్, ఎం.తాతయ్య, పాతపట్నం మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, మీసాల రామకృష్ణ, జయమునిరావు, రెడ్డి రామారావు, చింతాడ సూర్యనారాయణ, ఎనుగుతల సూర్యం, సంజీవరావు, రమణ, జి.రాము, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు వేలం పాట ఖరారు

- పంచాయతీకి తగ్గిన ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

నరసన్నపేట: స్థానిక మేజరు పంచాయతీలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆశీలు వేలం పాట ఖరారైంది. నాలుగు సార్లు వాయిదా అనంతరం మంగళవారం పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలుకానున్న వేలం పాటలో రోజువారీ మార్కెట్, కార్ స్టాండ్ కలిపి రూ.25.10 లక్షలకు పాటదారులు దక్కించుకున్నారు. గతేడాదిలో ఈ రెండూ కలిపి రూ.27.30 లక్షలు ఆదాయం వచ్చింది. వారపు సంతకు ఈ ఏడాది రూ. 3.75 లక్షలు రాగా.. గతేడాది రూ.4.25 లక్షలు, ఫిష్ మార్కెట్ ఈ ఏడాది రూ.2.75 లక్షలు రాగా.. గతేడాదిలో రూ.3.35 లక్షల ఆదాయం వచ్చింది. గత ఆర్థిక సంవత్సరం కంటే ప్రస్తుతం రూ.3.25 లక్షల ఆదాయం తగ్గింది. మార్కెట్‌లో వ్యాపారం పెరుగుతున్న దశలో ఆదాయం పెరుగుతుందని అందరూ భావించారు. పాటదారులందరూ సిండికేట్ కావడంతోనే ఆదాయం తగ్గిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం కంటే వేలం పాటలో ధర పెరగకపోడంతో వాయిదా వేయకుండా అధికారులు అనుమతించడంపై అనుమానులు వ్యక్తం అవుతున్నాయి.

సాగునీటి కోసం వాగ్వాదం



రైతులకు సర్దిచెబుతున్న పోలీసులు

సారవకోట: సాగునీటి కోసం సారవకోట, జలుమూరు మండలాల రైతుల మధ్య మంగళవారం వాగ్వాదం చోటు చేసుకుంది. సారవకోట మండలంలోని అక్కివలస సమీపంలో ఇదే మండలానికి చెందిన పలు గ్రామాల రైతులు వంశధార కాలువ నుంచి దిగువకు నీరు వెళ్లకుండా నిలుపుదల చేశారు. జలుమూరు మండలంలోని పలు గ్రామాల్లో రబీ వరి వేసిన రైతులు దీనిపై అభ్యంతరం తెలియజేస్తూ గేట్లు ఎత్తివేయాలని కోరారు. సారవకోట మండల రైతులు ససేమీరా అనడంతో ఇరు మండలాల రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. దీనిపై పోలీసులకు సమాచారం వెళ్లడంతో ఎస్‌ఐ అనిల్ కుమార్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇరు మండలాలకు చెందిన రైతులను బుధవారం పోలీస్ స్టేషన్‌కు హాజరుకావాలని సూచించినట్లు తెలిసింది.

చిరు జల్లులు



మెళియాపుట్టిలో కురుస్తున్న వర్షం

మెళియాపుట్టి: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కురిసిన చిరు జల్లులు జీడి, మామిడి పంటకు ఊరటనిచ్చిందని పలువురు రైతులు తెలిపారు. చీపురుపల్లి, హీరాపురం, పెద్దమడి, పట్టుపురం, మెళియాపుట్టి, మర్రిపాడు సి, తదితర గ్రామాల్లో జల్లులు కురిశాయి. ఎండతీవ్రత నుంచి ఉపశమనం కలిగింది.

సారవకోట మండలంలో..

సారవకోట: మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో మంగళవారం చిరు జల్లులు కురిశాయి. ప్రస్తుతం రబీలో వరి పండించిన రైతులు ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టారు. చిరు జల్లులు కురవడంతో వాటిని భద్రపర్చడానికి ఇబ్బందిపడ్డారు.

పాతపట్నంలో సినిమా షూటింగ్



సన్నివేశంలో నటిస్తున్న వినోద్ కుమార్

పాతపట్నం: మండల కేంద్రంలోని సరాలి రోడ్డు కూడలి సమీపంలో మంగళవారం రాత్రి సినిమా షూటింగ్ జరిగింది. నటుడు వినోద్‌కుమార్‌తో పాటు పలువురు నటులు సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు. వినోద్‌కుమార్‌పై ఓ సన్నివేశాన్ని చిత్రీకరించారు. సినిమా షూటింగ్ చూడడానికి స్థానికులు పోటీపడ్డారు.

ముగిసిన పైడితల్లి జాతర



పూజలందుకుంటున్న అమ్మవారు

పొందూరు: మండల కేంద్రంలో ఆదివారం ప్రారంభమైన పైడితల్లి జాతర మంగళవారంతో ముగిసింది. అమ్మవారి దర్శనానికి వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. అమ్మవారికి కోళ్లు, గొర్రెలను వేట ఇచ్చారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు పర్యవేక్షించారు.

డీఏ మంజూరు చేయాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ సభ్యులు

హిరమండలం: ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ మంజూరు చేయాలని యూటీఎఫ్ మండల కార్యదర్శి గోటివాడ రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు చెల్లించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని కోరారు. 21 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని.. సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. వీటిని ఉగాది కానుకగా ఇవ్వాలని కోరారు. యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.


ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని ఫల్గుణ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం తిరువీధి నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఊరేగింపులో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చిట్టిబాబు మృతికి సంతాపం



గవర చిట్టిబాబు (ఫైల్)

ఎల్.ఎన్.పేట: టీడీపీ సీనియర్ నాయకుడు, హిరమండలం మాజీ ఎంపీపీ గవర పద్మావతి భర్త చిట్టిబాబు (67) మంగళవారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హిరమండలం మండలం పాడలి గ్రామానికి చెందిన చిట్టిబాబు వంశధార నిర్వాసితులు కావటంతో ఎల్.ఎన్.పేట మండలం పెద్దకొల్లివలస పునరావాస కాలనీకి ఎదురుగా నివాసం ఏర్పాటు చేసుకున్నారు. చిట్టిబాబు కుటుంబ సభ్యులను టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, హిరమండలం జెడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు, పార్టీ నాయకులు పరామర్శించి సంతాపం తెలియజేశారు.

తాగునీరు వృథా



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలం రావిచంద్రి వద్ద వృథాగా పోతున్న తాగునీరు. వారం రోజుల కిందట పైపులైన్ లీకేజీ అయి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడేలేడు. వంశధార నదీ తీరంలోని లక్ష్మీనర్సుపేట మెగా రక్షిత తాగునీటి పథకం నుంచి సుమారు 30 గ్రామాలకు తాగునీరు అందించేందుకు పైపులైన్ వేశారు. పైపులైన్ లీకులను సరిచేయాలని అధికారులను చింతలబడవంజ, రావిచంద్రి, ధనుకువాడ, శ్యామలాపురం, తురకపేట సెంటర్ తదితర గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

సందడే.. సందడి



నిరంతర అభ్యసనే విజయానికి సోపానమని పొందూరు మండలం తాడివలస క్లస్టర్ పాఠశాలల చైర్మన్ బల్ల కంటయ్య అన్నారు. మంగళవారం లైదాం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, హెచ్‌ఎం బలివాడ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కూన గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

– పొందూరు

ఏపీపీఎస్సీ అభ్యర్థుల్లో గందరగోళం



కోర్ టెక్నాలజీ వద్ద నంబర్లను వెతుకుతున్న అభ్యర్థులు

నరసన్నపేట: స్థానిక కోర్ టెక్నాలజీలో మంగళవారం ఏపీపీఎస్సీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు పరీక్షలు నిర్వహించనున్నారు. మొదటి రోజు పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ పోస్టులకు పరీక్షలు జరిగాయి. నిర్వాహకుల అలసత్వం కారణంగా కేంద్రానికి వచ్చిన అభ్యర్థులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. పరీక్ష కేంద్రానికి 8 గంటల కల్లా అనుమతి ఇవ్వాలని స్పష్టంగా హాల్ టికెట్‌లో ఉన్నా.. 8.25 గంటల వరకు అనుమతించలేదు. ఏ ఫ్లోర్‌లో కేటాయించారనేది స్పష్టంగా బోర్డులో నంబర్లను ప్రకటించకపోవడంతో అభ్యర్థులు ఇబ్బందిపడ్డారు. 30 నిమిషాలపాటు ఆందోళనకు గురయ్యారు. అభ్యర్థుల పరిస్థితిని గమనించిన నిర్వాహకులు తరువాత నంబర్లను ప్రకటించడంతో అందరూ లోపలికి వెళ్లారు. మంగళవారం నిర్వహించనున్న పరీక్షకు ల్యాబ్ వన్‌లో 120 మంది, ల్యాబ్–2లో 135 మంది, ల్యాబ్–3లో 65 మందికి కేటాయించారు.

నవోదయకు ఎంపిక



సరుబుజ్జిలి: బి.రోహిత్ (నందికొండ)



ఎల్.ఎన్.పేట: దీపాన్విత (బొర్రంపేట)



పొందూరు: కె.నీహాంత్ (మానసవేణి)



హిరమండలం: ఎస్.మహికుమార్ (అక్కరాపల్లి)



నరసన్నపేట: కె. రోహిత్ (దేశవానిపేట)



నరసన్నపేట: ఎం. మోక్షవర్ధన్ (జమ్ము)



నరసన్నపేట: జి. చేతన్‌రాహుల్ (జమ్ము)



నరసన్నపేట: కె.భానుచంద్ర (కంబకాయ)



జలుమూరు: మెండ నిత్యశ్రీ (తమ్మయ్యపేట)



జలుమూరు: ఎస్. నంద కిశోర్ (గీతాంజలి)



పాతపట్నం: గంటా జీవన్ బాలు (జగ్గిలిబొంతు)

సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆయా పాఠశాలలు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు మంగళవారం తెలియజేశారు. వీరంతా ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్నారు. ఎంపికైన విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

– సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్తంగా..

నేడు వేలం పాట

ఆమదాలవలస: మున్సిపల్ కార్యాలయంలో ఆశీల వసూలుకు బుధవారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో నిర్వహించిన వేలంపాట వాయిదా వేయడంతో మళ్లీ వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో గల మార్కెట్‌లోని రోజువారీ ఆశీలు వసూలుకు, ఏడో వార్డు చింతాడ గ్రామంలో ప్రతీ శనివారం నిర్వహించే వారపు సంతలో ఆశీలు వసూలుకు, పట్టణంలో కబేళా నిర్వహణకు సంబంధించి వేలంపాట ఉంటుందన్నారు. పాటదారులు ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి చేరుకోవాలన్నారు.

మహాజన సభ రేపు

పోలాకి: ఈ నెల 27న స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)లో మహాజనసభ నిర్వహిస్తున్నట్లు సీఈఓ బి.రాంబాబు మంగళవారం తెలిపారు. సంఘ ఆర్థికలావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో నమోదుచేస్తున్న నేపథ్యంలో రైతుల సమక్షంలో వివరాలు తెలియజేస్తామన్నారు. మొండిబకాయిలు, వడ్డీలు, ఎరువుల విక్రయం, ధాన్యం కొనుగోలు ద్వారా వచ్చిన ఆదాయం వివరాలను వెల్లడిస్తామన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

కొత్తూరు: సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతీ ఒక్కరిపైనా ఉందని కొత్తూరు ఎక్సైజ్ సీఐ కిరణ్ మణీశ్వరి అన్నారు. మండలంలోని దొందమానుగూడ గిరిజన గ్రామంలో మంగళవారం నవోదయం–2 కార్యక్రమం నిర్వహించారు. నాటు సారా తాగడం వలన కలిగే అనర్థాలను వివరించారు. సారాకు దూరంగా ఉంటామని గిరిజనులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్‌ఐ కరణం ప్రసాద్, మహిళా పోలీస్ నిరోషా, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



రోడ్డు పక్కకు ఒరిగిన కారు

బూర్జ: మండలంలోని నారాయణపురం గ్రామ ఎడమ కాలువ వంతెన వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనానికి దారి ఇవ్వబోయి కారు రోడ్డు పక్కకు ఒరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. వంతెన రెయిలింగ్ ఇటీవల కూలిపోవడం వలన ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి రెయిలింగ్ పనులు పూర్తిచేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరారు.

చేపల పెంపకానికి ప్రాధాన్యం



చేపలు విడిచిపెడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

హిరమండలం: చేపల పెంపకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. వంశధార రిజర్వాయర్‌లో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద సుమారుగా 4.85 లక్షల చేప పిల్లలను మంగళవారం విడిచిపెట్టారు. మత్స్య సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు, ఏడీ సత్యనారాయణ, ముసలినాయుడు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.